# సుందరి-మణి

డాక్టరు అప్పరాజు శేషగిరిరావు

మనిషికో అలవాటు! మాసుందరికి మొదటినుంచీ ఒక చిన్న అలవాటు—ప్రొద్దున్నే కాలోచితాలు అయినతర్వాత నాకు తలకు నూనెరాయటం, నూటం దివ్వటం, రిస్టువాచీ కళ్లజోడూ అన్నీవరసగా చేతి కిస్తూవుండటం, టాయిలెట్ పూర్తిచేసుకొని నేను బయలుదేరేటప్పుడు 'నా మామూలు మా టేమిట'న్నట్లు ఒక్క వోరమాపు చూడటం, ఒక్కముద్దిచ్చి నేను గడిగడప దాటటం! - ప్రొద్దున వృత్తిలోకి దిగేటప్పుడూ సాయంత్రం టెన్నీసుకు వెళ్లేటప్పుడూ యీ సర్వీసు చెయ్యటం, ఆ మామూలు కాజేయటం, యిదే క్రమం తప్పని అలవాట్లు! కొంటెతనానికి కాస్త యేడిపిద్దామని పొద్దుటి మామూలు యెగకొట్టానా?— అపరాధం వడ్డీతోసహా సాయంకాలం వసూలుచేసిం దన్నమాటే!

మూడిదెల కని నెలరోజు లయింది మా అత్తవారు సుందరిని పుట్టింటికి తీసుకుపోయి. తిరిగీ వచ్చి వారం రోజు లయింది. ఆ రోజు శనివారం, సాయంకాలం. సాయంత్రం కాఫీ తాగుతూ 'కొత్తరికార్డు కొన్నాను చూశావా సుందరీ!' అన్నాను. 'యెంకివంటి పిల్ల రికార్డు అయిందట కొన్నారా లేదా?' అంది. 'చూడు మరి? కొన్నానో లేదో!' అన్నాను. ఫోను తెరిచి కొత్త ప్లేట్లు ట్రయి చేస్తోంది. వీధిలో మల్లెపూలకేక విన పడింది. ఆ కేకకు సుందరి చెవులు యెప్పుడూ పాము చెవులే. పిల్చి యిన్నిపూలు కొనుక్కుంది. ప్లేటు మారుస్తోంది. మధ్యమధ్య నాకు కావలసినవి అందిస్తోంది. నాటాయిలెట్ పూర్తయింది. మామూలు 'ముద్దు' చెల్లించాను. కాలు బయటపెడ్తున్నాను......

'పాత బాకీ మాట ?'

'యింకా లిమిటేషన్ పట్టలా?'

'మరీ అన్యాయం! నెలరోజులకే లిమిటేషనా?'

'......ఒకటి......రెండు ! బాకీ అంతారద్దు' అన్నాను. కాలు బయటపెట్టాను.....

ఫోను 'యెంకివంటిపిల్ల లేదోయి లేదోయి! యెంకినావం కింక రాదోయి రాదోయి'

ఫోను టక్కున ఆపేశింది సుందరి!!

అకస్మాత్తుగా వెన్నుమీద యెవరో చరిచినట్లు మనసులో యెట్లాగో అనిపించింది.

ఇల్లు విడిచి క్లబ్బుకు వెళ్లిన వ్యవధేలేదు. టెన్నీసు సెట్టు మొదలెట్టి పదినిమిషా లయిందోలేదో యింటి దగ్గిరనుంచి మానాన్నగారు స్వయంగా వచ్చారు 'కోడ లికి సుస్తీగా వుంది,ఒక్కసారి యింటికిరా'అని. సెట్టులో స్నేహితులకు క్షమాపణచెప్పకుని, రేకెట్టు అక్కడ పడేసి, స్టాండుమీదికోటు భుజంమీద వేసుకుని బయలు దేరి వస్తున్నాను. మానాన్నగారు 'కోడలి కో వాం తయింది. నీళ్లోసుకున్న మనిషిగదా అంచేతేమో అను కున్నా' అంటున్నారు. ఇంటికీ క్లబ్బుకీ రెండువందల గజాలకంటె యెక్కువవుండదు. నాలుగంగల్లో యింటి వద్ద వాలాను. సరాసరి గదిలోకి వెళ్లాను సుందరికోసం. సుందరి లేదు. గది శూన్యంగా వుంది. దులిపివేసినపక్క చెదరనేలేదు, ప్రక్క ప్రక్కగా పెట్టిన జోడుదిండ్లూ బెసకనేలేదు, జడేసుకుని మొహం రుద్దుకున్నాక పెట్టు కుందామని వూలుతో కట్టిన కత్తెరచెండు తెల్లటిపక్క మీద మొగ్గవిచ్చుతూ విచ్చుతూ కలకల నవ్వుతోంది, అరగంటముందు మ్రోగిన గ్రామఫోనుమూత అట్లా తెరి చేవుంది, సుందరిమాత్రం గదిలోలేదు. —పడమటిం ట్లోకి వెళ్లిచూస్తే దొడ్డిగడపదగ్గిర కూర్చున్న మాఅమ్మ, మాఅమ్మవొళ్లో తలకాయ పెట్టుకొని మాసుందరీ!

'యేమి టిది' అని అడిగా. మాట్లాడలేదు. సగం యెత్తినకళ్లతోనూ, కొద్దిగా కదల్చిన చేత్తోనూ సంజ్ఞ మాత్రం చేసింది సుందరి 'వెళ్తున్నాను' అనే అర్థం యిచ్చేటట్లుగా. చెయ్యిపట్టుకుచూస్తే నాడిలేదు. చల్లగా కలవ కాడల్లే వుంది, ఛప్పున డిస్పెన్సింగురూములోకి వెళ్లి

కస్తూరియిన్‌జక్షన్ సిరెంజిలోకి యెక్కించుకువచ్చాను. నీళ్లోసుకున్న మనిషిగదా అని స్ఫురణకువచ్చి 'నాన్నగారూ! వెళ్లి లేడీ డాక్టరును పిలుచుకురాండీ'అన్నాను. మానాన్నగారు గడపదిగారు. నేను యిన్‌జక్షన్ యివ్వటానికి సుందరిచెయ్యి నాచేతులోకి తీసుకున్నాను... ...ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆగిపోయినయి......ఇన్‌జక్షన్ యిచ్చాను......స్టెతస్‌కోపు గుండెలమీద పెట్టి చూచాను......గడియారం ఆగిపోయింది......చీకటి! ......కారుచీకటి!!..................పదినిమిషాలకల్లా లేడీడాక్టరును వెంటపెట్టుకొని మానాన్నగారు వచ్చారు. దొడ్డిగడపలో తను చూచి పెళ్లినకోడలు కొడ్డివాకిట్లో క్రిందపడుకో పెట్టబడివుంది. చుట్టూ సుమారు వందమంది మూగారు. కొందరు పాముకాటేమో అని మంత్రిస్తున్నారు. కొందరు కప్పనాకుడేమో అంటున్నారు. లేడీడాక్టరుకూడా స్టెతస్‌కోపుతో చూచింది. పెదవి విరిచి జటుక్కు యెక్కింది...సడెన్ హార్ట్ ఫెయిల్యూర్ అంది!......అయిపోయింది!......జ్యోతి ఆరిపోయింది! నాకున్న కొస్త ఆశాకూడా అడుగంటిపోయింది! నేనింకా నిరీక్షిస్తున్నా ఒకవేళ లేడీడాక్టరు వచ్చి 'డాక్టర్! నీస్టెతస్‌కో పేమన్నా చెడిపోయిందా? చక్కగా హార్టుబీట్సు వినపడుతున్నయే నాకు!' అంటుందేమో అని. ఆ ఆశకూడా నిరాశఅయిపోయింది. హార్టు ఫెయిల్యూర్!...సుందరిహార్టు ఫెయిల్యూర్!...

ఎప్పటికైనా గుండె ఆగకపోతే ప్రాణమే పోదు. ముందుహృదయస్పందనముఆగి తర్వాత ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆగిపోతే —సడెన్ హార్ట్ ఫెయిల్యూర్. మాసుందరికి అట్లా కాకుండా యథావిధిగానే జరిగినయి —ముందు లంగ్సు, తర్వాత హార్టు! వార్నింగు లేకుండాను, ఆకస్మికంగానుమాత్రం. జరిగినయి. కారణం కనుక్కోటానికి సావకాశం లేకుండామాత్రం క్షణాల మీద జరిగిపోయినయి. అందుచేత యిది 'చావు' అని 'మరణం' అని నాకు అనిపించలేదు. మరో ప్రపంచానికి అర్జంటు 'కాల్' వస్తే అకస్మాత్తుగా వెళ్లిపోయిందేమో అనుకున్నా. యెప్పటికైనా కలుసుకోలేకపోతానా, చూడలేకపోతానా అని నాగుండె నాకు నిబ్బరం చెప్పతోంది. కాని ఆలోచించినకొద్దీ యీఆరేళ్లనుంచీ అనుభవించిన 'హాయి' అంతా 'మాయా ?', సుఖాలన్నీ వట్టి స్వప్నాలా ? నిజంగా జరిగినట్టు కన్పించినసంగతులన్నీ శుద్ధ అబద్ధాలా ? కడచిన ఆరేళ్లూ కలా లేక యీ ఆరు నిమిషాలూ కలా ? అసలు పోయింది నాసుందరా లేక నేనా ? యిట్లా అనేక ప్రశ్నలు లోపలినుంచి వస్తున్నయి గాని జవాబులు లోపలినుంచీ రావటంలేదు, బయటనుంచీ రావటంలేదు. మొత్తంమీద సీను ఆరునిమిషాలకన్న యెక్కువ పట్టలేదు. తెర పడిపోయింది!....ఒకఅంకం సమాప్తమయిపోయింది!......

అరగంటక్రింద ఆగినఫోను —'యెంకినావంకింక రాదోయి రాదోయి'.

నాలోంచి — ఆ! రాదూ!...రాదూ!......

మళ్లా ఫోను —రాదోయి!...రాదోయి!

అంతే! ఫోను మళ్లా పలకలేదు.

యీ భైయేళ్ల మా తండ్రినీ, నలభైయేళ్ల తల్లినీ నేనే వోదార్చాను, వేదాంతం ముక్కలు చెప్పి కాదు; వేదాంతం నాకు రాదు కూడాను. 'అయిపోయిందిగదా! వూరుకోండి యేం చేస్తాం?' అన్నాను. అంతే. నన్ను వోదార్చవలసిన అవసరం యెవ్వరికీ కల్గించలేదు. నాకు కంటివెంట నీరే రాలేదు. మనసులో విచారిస్తున్నానో లేదో యెవరికీ తెలియదు. అథవా మనసులో విచారిస్తున్నా ననుకున్నా నన్ను వోదార్చటానికి నేను విచారం సూచిస్తూ మాట్లాడితేగా ?

అప్పటికి వైద్యం ప్రాక్టీసు ప్రారంభించి సుమారు అయిదేళ్లు కావచ్చింది. యెన్నోసార్లు ఉచ్ఛ్వాస నిశ్వాసాలు లేకుండా భూపతన మవుతూ వచ్చిన శిశువులను చూచాను, కాసేపటికి క్యారు-క్యారు మనటమూ చూచాను, గాలి పీల్చటమూ చూచాను! కళ్లు తెరిచి అన్నీ మాట్లాడుతున్నమనిషి ఛప్పున కళ్లు తేలేశి సటుక్కుమంటమూ చూచాను! ఆ శిశువులోకి ప్రాణం యెక్కడినుంచి వచ్చిందో తెలియలేదు; యీ వ్యక్తిలోంచి ప్రాణం యెక్కడికి పోయిందో తెలియలేదు. అదెక్కడినుంచి వచ్చిందో ఇదక్కడికే పోయి వుంటుంది అనుకునేవాణ్ణి. యిప్పుడు నా సుందరి కూడా

అక్కడికే పోయి వుంటుం దని నిశ్చయించుకున్నా. యెప్పుడో ఒకప్పుడు నేనూ అక్కడికే పోతాగదా అనుకున్నా. కాస్త 'ముందు వెనక' అంతేగదా భేదం అనుకున్నా. యిట్లా మనసులోనే అనుకున్నాను. మనసులోనే దిగమింగేశాను నా సుందరిని, నాసుందరి రూపాన్ని, నా సుందరి శరీరాన్ని, నా సుందరి సర్వస్వాన్నీ. పాపం! మా వాళ్లు ఆ శరీరాన్ని కాల్చి బూడిదచేసి వచ్చామనుకునేవాళ్లు! కాని నాకు తెలుసు నాసుందరిని నేనే మింగేశానని—నాలోనే వుందని! ఆరేళ్లు నీడల్లే నన్ననుసరించి, కష్టాలలో కష్టాలు సుఖాలలో సుఖాలు సమంగా పంచుకొని నాప్రేమ రాజ్యంలో డిక్టేటరల్లే రాజ్యంచేసి మరోప్రపంచం లోంచి రేడియోకాల్ అనండి, ఆహ్వానమనండి, లేదా టైమయిపోయింది రమ్మని కొట్టినగంట అనండి యేదో అందరికీ అర్థంకాని వింతపిలుపు వచ్చి వెళ్లిపోయింది. ఆకాల్ గాని గంటగాని నన్నూ పిలుస్తుంది కొంతకాలానికి. నేనూ వెళ్తాను. మరెందుకు యీకాస్సేపట్లో యీ కన్నీళ్లు?

కన్నీళ్లు దిగమింగాను!

కడుపు చెరువయింది!

గుండె రాయయింది.

మనశ్శాంతికోసం అని పేరుపెట్టుకొని చెన్నపట్నం వెళ్లి కొన్నాళ్లు గడిపాను. రోజూ మెరీనాకు వెళ్లేవాణ్ణి. అప్పుడప్పుడు రాక్సీకి వెళ్ళేవాణ్ణి. పెద్దబాధ మనసులో యేమీ అనిపించటంలేదు. యెంతో మనశ్శాంతి కల్గిందని మరెట్లా చెప్పటం? నాసుందరి వున్నప్పుడు రాక్సీలో వినపడిన సంగీతం యిప్పుడూ వినపడింది. అప్పుడు సముద్రంమీద కనపడిన అలలు యిప్పుడూ కనపడినయి. అప్పుడూ సముద్రపువొడ్డున యిసక వుండేది. యిప్పుడూ వుంది. మార్పేమీ కనపడలేదు. ఔను! మార్పు నా జీవితంలో జర్గితే సముద్రపువొడ్డున యిసకా, టాకీలో సంగీతమూ లేకుండా యెందుకు పోవాలి?

సూర్యుడు తూర్పునే వుదయిస్తున్నాడు! అయిస్ క్రీమ్ తినటానికి చల్లగానే వుంది! విశేషా లేమీలేవు పట్నంలో!

అక్కడనుంచి మకాం అనంతపురానికి మార్చాను. మండువేసవి. అర్ధరాత్రి పదకొండుగంటల సుమారుకు వూరు చేరాను. వూరు కొత్త. జట్కావాడు 'యెక్కడికి సార్?' అన్నాడు. పెద్ద ఆస్పత్రికి పోనిమ్మన్నాను. అక్కడ వాకబుచేసి 'ఫలానివారి యిల్లెక్కడ' అని అడిగి ఆయిల్లు చేరినతర్వాత బండివాణ్ణి 'మిస్ జేకబ్ గారు వున్నారా' అని అడగమన్నాను. జేకబ్ డాబా దిగి బండి దగ్గిరకు వచ్చింది. 'గుడ్ మార్నింగ్ మణి' అంటే 'గుడ్ మార్నింగ్ రాజు' అని షేక్ హాండ్ యిచ్చింది. మణి చెయ్యిచల్లగాయిగమల్లేఅనిపించింది. 'నీచెయ్యింతచల్లగా వుందే' మన్నాను. 'కాని నాహృదయంలో వెచ్చతనమే వుంద'ని మణి సమాధానంచెప్పింది. సరే రేపు కలుసుకుంటానని గుడ్ నైట్ చెప్పి మకాం సత్రంలో వేశాను.

మణి—సంవత్సరంక్రిందట ఆస్పత్రిలో నాదగ్గిర పనిచేసిన నర్సు. ఇప్పుడు ట్రాన్సుఫర్ అయి అనంతపురంలో పనిచేస్తోంది. అనంతపురం వెళ్ళేముందు మణీ, మణితోపాటు యింకా యిద్దరు మలయాళనర్సులూ 'డాక్టర్! యీవూరునుంచి వెళ్లిపోతున్నాము. ఒక్కసారికూడా యిక్కడ సినీమా చూడనేలేదు. మా కొక్కసారి చూపించవా?' అన్నారు. సరేనని చెప్పి ఆ రాత్రి ముగ్గురునర్సులను మాసుందరిని వెంటబెట్టుకుని జట్కాలో సినీమాకు వెళ్లి చూచాము. తిరిగీ వచ్చేస్తున్నాము. చీకట్లో బండిలో కూర్చున్న నాచేతికి కొంతసేపటికి యింకోచేయి తగిలింది. షేక్ హాండేమో అనుకున్నా! ఇంకోచెయ్యి నావిటికెనవ్రేలు తడుముతోంది!... వళ్లు ఝల్లుమన్నది! నే నేమీ మాట్లాడలేదు. యెవరి క్వార్టర్సుదగ్గిర వారిని దింపేసి నేనూ సుందరీ యింటికి తిరిగివచ్చాము. ఒకనిద్ర పోయి లేచి దీపం పెద్దది చేసి చేతినవున్న వుంగరం తీసిచూస్తే లోపలివేపున రెండక్షరాలు—మ...ణి!

నాకాశ్చర్యంవేసింది. అప్పటికి సంవత్సరంనుంచి రోజూ నేను చూచేమణే! ఒక్కరోజైనా తనకు ప్రేమ వున్నట్టు నాకు చెప్పనూలేదు, నాకు ప్రేమ వుందా అని అడగనూలేదు. వూరు విడిచి వెళ్లిపోతూ అర్ధరాత్రి యీ పనిచేసి చక్కాపోయింది. మూడోనాడు అనంతపురంనుంచి వుత్తరం వచ్చింది తనసాహసానికి క్షమించమని.

తనకు జవాబనేది వుంటుందా అని, తనకు సంవత్సరం నుంచీ ధైర్యంచిక్కలేదనీ, చివరికి యిట్లా తెగబడ్డాననీ, తనకు నాహృదయంలో కాస్తచోటు కావాలనీ, రెండు వస్తువులు దయవుంచి పంపమనీ...ఒకటి, నాపేరుగల చిన్న వుంగరం...రెండు, నాఫౌన్ టెన్ పెన్ క్లిప్పులో యిమిడిన నాచిన్నఫొటో. మూడురోజులక్రితం జరిగిన సంగతి చెప్పి, వుత్తరం చదివి వినిపించాను— మాసుందరికి. 'యేమిటి నీసలహా' అన్నాను. పంపించండి యేం పోయిందిగనక'అంది. 'బాగా ఆలోచించి చెప్పావా? హృదయంలో కాస్త చోటంటోంది. దాని మాటేమిటి?' అన్నాను. 'జాగా వుంటే అట్లాగే యియ్యండి. నాకేమభ్యంతరంలేదు. జవాబుకూడా రాయండి' అన్నది సుందరి. 'జాగా వుంటే...?' 'వుందా'అని ఆలోచించిచూస్తే—అదేమన్నా పెద్దబంగాళాగనకా? నాకేం పాలుపోలేదు. అది మనసుకు పట్టించుకోకుండా ఆసంగతి విడిచిపెట్టి అడిగినరెండూ పంపించాను. వచ్చే వుత్తరం వెళ్లేవుత్తరం ఒకచిన్న ఆఫీ సయిపోయింది. మూడునాలుగురోజుల కోసారి మధ్యాహ్నంపూట నవ్వుతూ సుందరి మంచందగ్గిరకు వచ్చి 'మణిదగ్గిరనుంచి వుత్తరం వచ్చింది. ఇస్తే నా కేమిస్తారు' అనేది. 'నీమామూలు తీసుకో' అని జవాబుచెప్పేవాణ్ణి. మణి రాసిన వుత్తరాలన్నీ మాసుందరే తనట్రంకుపెట్టెలో జాగ్రత్త చేస్తూవుండేది.

ఆ మణే యీ అనంతపురం నేను వెతుక్కుంటూ వెళ్లినమణి!

మర్నాడు మధ్యాహ్నం జేకబ్ క్వార్టర్సులో క్యాంపుకాట్ మీద నేను కూర్చుని మా సుందరియొక్క ఆకస్మిక...మొదలైన సంగతులన్నీ పూసగుచ్చినట్టు చెప్పాను. మణి కాఫీ కాచి పెద్ద గ్లాసుటంబ్లరులో పోసి చేతి కందిచ్చింది. 'అబ్బో యింతెవరు తాగగలరు?తగ్గించ' మన్నాను. 'యేం నేను లేనా'అంది మణి. సగం తాగి తనకిచ్చేవరకు చూస్తూనుంచుందేగాని థర్మాస్లాసుక్లలో మిగిల్చినకాఫీ తను తాగదు. గ్లాసులో నేను మిగిల్చిన సగంకాఫీ తాగి 'డ్యూటీ టైమవుతోంది వెళ్లా'లంది— మణి. 'యీపూట సెలవు పెట్టలేకపోయావా' అన్నాను. 'లేదు నువ్వొచ్చావని తెలిసి అసిస్టెంటు సర్జను సెలవిచ్చేటట్టు కన్పించలేదు. అందుచేత సెల వడగలేదు' అంది. 'పోనీలే' అన్నాను. తలవంచుకుని...చప్పన రెండు చేతులూ నా మెడకు చుట్టుకున్నాయి —నావొళ్లో మణి పుస్తకమల్లే కూర్చుంది... 'యింకా నన్ను తాకటానికి నీకు ఆలోచనేనా' అంది.

అట్లా వారం పదిరోజులు గడిచిపోయినయి. అదివరకు గజంకూరాన నిలిచేమణి యిప్పుడు ప్రక్కన కూర్చోగలదన్నమాటే తప్ప అంతకన్న విశేషమేమీ లేదు — నామనసులోనూ లేదు, మణినడవడిలోనూ లేదు.

ఒకరోజున మణితో అన్నాను"యేం మణీ! సుందరి వెళ్లి రెండునెలలన్నా కాలేదు. నాకైతే ముందు సంగతేమిటనిగాని, లైఫుయొక్క ఫ్యూచర్ యేమిటని గాని యింతవరకు ప్రశ్నలే కల్గటంలేదు. కాని ఇరవై నాలుగు సంవత్సరాల వయసులోవున్న నన్ను మావాళ్లున్న స్వేచ్ఛగా వుండనిస్తారని నాకేమాత్రం నమ్మకం లేదు. దేవుడు మూడు పంక్తులు నుదుట వ్రాశాడంటారు. నాకు యిప్పుడు ఒకపంక్తి చెరిగిపోయింది. రెండోపంక్తికి ముగ్గు రాచి యేమిటో ప్రస్తుతం నేను చూచుకోవాలి. మూడోపంక్తి శ్మశానంలో కట్టెలే కనిపెడ్తయి. నీ వారాత్రి నాచేతికి పెట్టిన వుంగరం యిదుగో చూచుకో. నాసుందరి వున్నప్పుడే నాహృదయంలో తావు కోరినదానవు నువ్వు! తన స్థానమే ఖాళీచేసి సుందరి వెళ్లిపోయింది. ఆస్థలమంతా పెద్ద అగాధమల్లేనో, పెద్ద శ్మశానమల్లేనో వుంది. యీ అగాధాన్ని భర్తీచెయ్యమనో యీశ్మశానంలో రాజ్యం చేయమనో నాకు యెవరినన్నా కడతా రన్నమాట. దాన్నే 'ద్వితీయం' అనబోతుంది—లోకం. నీవు వుత్తరంలో కోరిన కోర్కెనుబట్టి ఆస్థానం ఆక్రమించటానికి అర్హతగలదానవు అన్నివిధాలా నువ్వు! నీవు శక్తిగల తోటమాలి వయితే యీ అగాధం చక్కనిసరోవరంగా మారిపోవచ్చు, యీశ్మశానం ఉద్యానవనం కావచ్చు. అప్పుడది నామానస సరోవరం అవుతుంది, అందులో విహరించేహంసివి నీవు. ఉద్యానవనంలో సంచరించే వనదేవతవు నీవు. ఆమహాశక్తి నీకు లేకపోతుందా నీ 'రాజు' మరుభూమిని పాలించే 'భూతరాజు', నీవు అందులో 'కాటికాపరివి'. నీ ప్రజ్ఞావిశేషాలు ప్రక

టించుకోటానికి యిది నీకు చక్కని అవకాశము. ఇదే నారాకకు కారణం. ఆలోచించి నాకు సమాధానం చెప్పు. కూడా బయల్దేరి వస్తానంటావా, సరే! లేదు ఆలోచించటానికి వ్యవధి కావాలా, నిరభ్యంతరం!'... 'రేపు చెప్తా'నంది మణి. మరునాడు వచ్చేటప్పటికి డ్యూటీనుంచి మణి యింకా తిరిగి రాలేదు. టేబుల్ మీద ఒకకవరు నాకు అడ్రసు చేసి వుంది.

కవరులో నా వుంగరం వుంది. కాగితంలో యీ ముక్క లున్నయి......

నా ప్రియమైన రాజు,

సుందరి ప్రేమరాజ్యంలో నాది నిర్బంధ ప్రవేశ మని నాకు తెలుసును. నిన్ను ప్రేమించటానికి సుందరి అనుజ్ఞ యివ్వటం నాకు తీరనిసమస్య. ఈ ప్రపంచంలో కూడా దేవత లుంటారని నేను కలలో కూడా అనుకో లేదు. ఆ మెస్థానం ఆక్రమించటానికి నాకు యేవిధం గానూ అర్హత లేదు. నేను నిన్ను కోరేదల్లా నీఫొటో నాతో పాటు నా సమాధిలోకి తీసుకుపోనిమ్మని. నీవుంగరం నీకు పంపేస్తున్నాను. దీనితో నీకు స్వేచ్ఛ. ముద్దులు.

ఎల్లప్పుడూ నీయొక్క
మణి.

ఉత్తరం వుంగరం తీసుకొని నా వ్రేలి వుంగరం చిన్న కాగితంలో చుట్టి బల్లమీద విడిచి బయటికి వచ్చే శాను. కాగితంలో 'గుడ్ బై' అనిమాత్రం రాశాను. అంతే! మళ్లా మణిని యింతవరకు చూడలేదు!

మణి నాకు యిప్పటికీ సమస్యే! మణి చెప్పి నట్టు నా సుందరి దేవతేనేమో? లేకపోతే యింత ఆకస్మికంగా మాయమైపోతుందా?

చెవులు చిల్లులు పడేటట్టు ఫోను మళ్లా —
'యెంకి వంటిపిల్ల లేదోయి లేదోయి,
యెంకి నావం కింక రాదోయి రాదోయి'.

---

## వ్యాసవిలేఖకులకు మనవి

వ్యాసాలు ఎనిమిదిపుటలకు మించకుండా ఉండాలి. వ్యాసరచన రంజకంగా ఉండాలి. శాస్త్రీయవిషయాలనుగురించిన వ్యాసాలుకూడా ఎక్కువ పరిభాషా, ఎక్కువ వివరాలూ లేకుండా సంగ్రహంగాను, సామాన్యపాఠకునికి విషయం బోధపడేటట్టు సులభంగాను, మనస్సును కథలా ఆకట్టేటట్టు ఆకర్షకంగాను ఉండాలి. శాసనవ్యాసాలు పదిహన్నెండు పుట లకు మించేయెడల రెండుసంచికలలో ప్రకటింపవలసివచ్చును.

దేశాన్ని ఎక్కువగా కలవరపరుస్తున్న సాంఘిక ఆర్థిక, రాజకీయాది విషయాలనుగురించీ, మనఆంధ్రుల ప్రత్యేకసమస్యలనుగురించీ ప్రత్యేకవ్యాసాలు కావాలి. సాధ్యమయినంతవరకు ఎత్తుకునే విషయంలోను, చూచేదృష్టిలోను, రచించే రచనలోను కొత్తదనం కావాలి. మన ఉద్యమాలూ, మనదేశం, మనసంఘం, మనఆశయాలు భారతిలో ప్రతిఫలించేటట్టు చూడ వలసిందని వ్యాసకర్తలకు మనవి.—భా. సం.